సంపుటి :02 సంచిక :268 పేజీలు :06 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

గురువారం 01,జనవరి 2026

# 2028లో కేసీఆరే మళ్లీ సీఎం

- లక్ష్యం దిశగా కదంతొక్కండి
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి
- గులాబీ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

05

2028లో కేసీఆరే మళ్లీ సీఎం అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ నూతన సంవత్సర వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. వేడుకల్లో కేటీఆర్ పాల్గొని కేక్ కట్ చేశారు..



# 3 రోజులు.. వెయ్యి కోట్లు

- ఇయర్ ఎండింగ్.. ఆదాయం ఆల్ టైం రికార్డు
- డిసెంబర్ నెల మొత్తం రూ.5 వేల కోట్లు
- రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం
- ఇంత పెద్ద మొత్తంలో ఆదాయానికి రెండు కారణాలు
- ఒకటి పంచాయతీ ఎన్నికలు.. రెండోది న్యూ ఇయర్ వేడుకలు

2లో..

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు, నూతన సంవత్సర వేడుకలు ఆబ్కారీ శాఖ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా కాసుల వర్షం కురిపించాయి. కేవలం డిసెంబర్ చివరి మూడు రోజుల్లోనే ఏకంగా వెయ్యి కోట్ల రూపాయల విలువైన మద్యం అమ్ముడవ్వడం గమనార్హం. న్యూ ఇయర్ వేడుకలకు తోడు రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల వాతావరణం తోడవ్వడంతో మద్యం వినియోగం రికార్డు స్థాయికి చేరింది. ఒక్క డిసెంబర్ నెలలోనే ఏకంగా 5,102 కోట్ల రూపాయల ఆదాయం లభించడంతో రాష్ట్ర ఖజానా కళకళలాడుతోంది. గత ఏడాదితో పోలిస్తే అమ్మకాలు భారీగా పెరగడం విశేషం కాగా, పండుగ వేళ మద్యం విక్రయాల్లో తెలంగాణ మరోసారి తన హవా చాటుకుంది.

— అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి





2లో..

## అడిషనల్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రవి

## కొత్తగూడలో మళ్లీ పులి కేక

- అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తం
- సరిగ్గా గతేడాది ఈ రోజునే పులి అలికిడి
- మళ్లీ అదే రోజు ఇదే ప్రాంతంలో సంచారం



5లో..

# అంబరన్నంటిన న్యూ ఇయర్ సంబురాలు

- కిటకిటలాడిన ఆలయాలు
- ఇష్టదైవానికి మొక్కులు తీర్చుకున్న భక్తులు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2026 నూతన సంవత్సర వేడుకలు అంబరన్నంటాయి. గురువారం వేకువజాము నుంచే భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాల గుడి, రామప్ప ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాదిలో తమకు, తమ కుటుంబాలకు అంతా మంచి జరగాలని కోరుకుంటూ వేలాది మంది భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రధాన ఆలయాలన్నీ విద్యుత్ దీపాలు, పుష్ప అలంకరణలతో శోభాయమానంగా దర్శనమివ్వగా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

— అక్షరదర్బార్, వరంగల్



5లో..



# 3 రోజులు.. వెయ్యి కోట్లు

- ఇయర్ ఎండింగ్.. ఆదాయం ఆల్ టైం రికార్డు
- డిసెంబర్ నెల మొత్తం రూ.5 వేల కోట్లు
- రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం
- ఇంత పెద్ద మొత్తంలో ఆదాయానికి రెండు కారణాలు
- ఒకటి పంచాయతీ ఎన్నికలు.. రెండోది న్యూ ఇయర్ వేడుకలు

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : రాష్ట్రంలో 2026 నూతన సంవత్సర వేడుకలు మద్యం విక్రయాల్లో సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఆబ్కారీ శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం, డిసెంబర్ చివరి మూడు రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఒక డిసెంబర్ నెలలోనే సుమారు రూ.5 వేల కోట్ల మేరకు మద్యం విక్రయాలు జరగం ఒక రికార్డు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అమ్మకాలు భారీగా పెరగడం విశేషం. సాధారణంగా పండుగలు, వేడుకల సమయంలో మద్యం విక్రయాలు పెరగడం సహజమే అయినప్పటికీ, ఈసారి నమోదైన గణాంకాలు ఎక్సైజ్ శాఖ చరిత్రలోనే ఇదొక రికార్డు. డిసెంబర్ 29 నుంచి 31 వరకు జరిగిన ఈ విక్రయాల జోరు చూస్తుంటే, తెలంగాణలో న్యూ ఇయర్ కిక్కు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకో వచ్చు.

## - రెండు కారణాలు

భారీ విక్రయాలకు ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి నూతన సంవత్సర వేడుకలు కాగా, మరొకటి రాష్ట్రంలో నెలకొన్న సర్పంచ్ ఎన్నికల వాతావరణం. గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకోవడం, అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించే క్రమంలో విందులు, వినోదాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో మద్యం వినియోగం ఊహించని రీతిలో పెరిగింది. దీనికి తోడు రాష్ట్రవ్యాప్తంగా కొత్త మద్యం విధానం అమలులోకి రావడం, డిసెంబర్ నెల నుంచే కొత్త లైసెన్స్‌దారులు దుకాణాలను ప్రారంభించడం కూడా విక్రయాల పెరుగుదలకు దోహదపడ్డాయి. కొత్త దుకాణాల యజమానులు తమ వ్యాపారాన్ని ఉత్సాహంగా ప్రారంభించగా, పండుగ సీజన్ వారికి భారీ లాభాలను తెచ్చిపెట్టింది.

## - ఒక్క నెలలోనే..

డిసెంబర్ నెల విక్రయాలను గమనిస్తే తెలంగాణ ఎక్సైజ్ శాఖకు ఇది కాసుల వర్షం కురిపించిన నెలగా చెప్పవచ్చు. నెల మొత్తం మీద దాదాపు రూ.5,102 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఒకే నెలలో ఐదు వేల కోట్ల మార్కును దాటడం ఇదే తొలిసారి కావడంతో అధికారులు దీనిని ఆల్ టైమ్ రికార్డుగా పరిగణిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,620 మద్యం దుకాణాలు, 1,100 బార్ అండ్ రెస్టారెంట్లు ఈ భారీ ఆదాయాన్ని సమకూర్చడంలో కీలక పాత్ర పోషించాయి. అటు ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరగా, ఇటు మద్యం వ్యాపారులు కూడా ఈ సీజన్ ను విజయవంతంగా ముగించారు.

## - గణంకాలు ఇలా..

గణాంకాలను పరిశీలిస్తే, డిసెంబర్ 31వ తేదీ ఒక్కరోజే సుమారు 350 కోట్ల రూపాయల పైచిలుకు మద్యం అమ్ముడైంది. డిసెంబర్ 29న 280 కోట్లు, 30వ తేదీన 380 కోట్ల రూపాయల మేర అమ్మకాలు జరిగాయి. కేవలం ఈ మూడు రోజుల్లోనే దాదాపు 8.30 లక్షల కేసుల లిక్కర్, 7.78 లక్షల కేసుల బీరు డిపోల నుంచి దుకాణాలకు తరలి వెళ్లాయి. హైదరాబాద్ నగరంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అమ్మకాలు అత్యధికంగా నమోదయ్యాయి. నగరంలోని పబ్బులు, క్లబ్‌లు మరియు బార్ల వద్ద జనం పోటెత్తడంతో మద్యం నిల్వలు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి.

## - తనిఖీలు ఉన్నప్పటికీ..

భారీ అమ్మకాల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ముందస్తుగానే తగిన ఏర్పాట్లు చేసింది. డిపోల నుంచి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా, నకిలీ మద్యం పంపిణీ కాకుండా కఠిన నిఘా ఉంచింది. న్యూ ఇయర్ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించినప్పటికీ, విక్రయాల జోరు మాత్రం ఎక్కడా తగ్గలేదు. మొత్తం మీద తెలంగాణలో 2026 నూతన సంవత్సర వేడుకలు మద్యపాన ప్రియులకు అసలైన 'కిక్కు'ని ఇవ్వడమే కాకుండా, ప్రభుత్వానికి రికార్డు స్థాయి ఆదాయాన్ని కట్టబెట్టాయి.

# దివ్యాంగుల సేవే నిజమైన మానవ సేవ

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన మల్లికాంబ మనోవికాస కేంద్రం దివ్యాంగుల పిల్లలు

అక్షరదర్బార్, హనుమకొండ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని హనుమకొండ సుబేదారిలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మల్లికాంబ మనోవికాస కేంద్రం దివ్యాంగుల పిల్లలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నూతన సంవత్సర గ్రీటింగ్ ◌్లతో పాటు పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. దివ్యాంగుల పిల్లల ఆత్మీయ అభినందనలకు ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేస్తూ, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆశీర్వదించారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల సేవే నిజమైన మానవ సేవ అని అన్నారు. మల్లికాంబ మనోవికాస కేంద్రం ద్వారా దివ్యాంగ పిల్లలకు విద్య, వైద్య, పునరావాస సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో, మానవీయ దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో దివ్యాంగ పిల్లలు మరింత అభివృద్ధి సాధించి, ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు రామలీల, కళ్యాణ్ కుమార్, మల్లికాంబ సిబ్బంది పిల్లలు తదితరులు పాల్గొన్నారు.





# కలెక్టర్ కు నాయిని శుభాకాంక్షలు

అక్షరదర్బార్, హనుమకొండ; నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు జిల్లా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమకొండ జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలను అభినందించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు,అధికారుల సమన్వయం మరింత బలోపేతం కావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు ఉన్నారు.



# అడిషనల్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రవి

- కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన అదనపు కలెక్టర్

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా నియామకం అయిన నెమరుగొమ్ముల రవి గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. హన్మకొండ అదనపు కలెక్టర్ గా నియామకం అయిన రవి ఇంతకుముందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, వరంగల్ జిల్లాలో నర్సంపేట ఆర్డీవోగా విధులు నిర్వహించారు.

# అదనపు కలెక్టర్ కు విషెష్



అక్షరదర్బార్, హనుమకొండ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నేత ఈవీ శ్రీనివాసరావు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ రవికి శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్ రవి గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు పలువురు అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) రవిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# మరిన్ని మైలురాళ్లు అధిగమించాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- సీఎండీకి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు



అక్షరదర్బార్, హనుమకొండ: 2026 నూతన సంవత్సరంలో అందరి సమిష్టి కృషితో మరిన్ని విజయాలు సాధించి టీజీఎన్పీడీసీఎల్ సంస్థను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. గురువారం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి అధికారులు, ఉద్యోగులు ఉద్యోగ సంఘాల అసోసియేషన్లు, వివిధ ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు పూలబొకేలు, పూల మొక్కలు, పుస్తకాలు, పెన్నులతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల పట్ల నిబద్ధతతో మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి పాటుపడాలని కోరారు. ఇటీవల వరదల సమయంలో వినియోగదారులకు విద్యుత్ సరఫరా అందించడంలో చూపిన సాహసం, పట్టుదల అభినందనీయమని కొనియాడారు. విద్యుత్ అంతరాయాల సమయాన్ని (ఎస్ఏఐడీఐ), అంతరాయాల సంఖ్యను (ఎస్ఏఐఎఫ్ఐ) గణనీయంగా తగ్గించగలిగామని సీఎండీ వెల్లడించారు. రెవెన్యూ లీకేజీలను అరికట్టడంలో సాధించిన పురోగతి సంస్థ ఆర్థిక పరిపుష్టికి ఎంతో దోహదపడుతుందన్నారు. భద్రత విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, ప్రమాద రహిత సంస్థగా ఎదగడమే మన లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. వినియోగదారుల సంతృప్తియే మన అంతిమ లక్ష్యం అని పేర్కొంటూ రానున్న రోజుల్లో మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడానికి సాంకేతికతను మరింతగా అందిపుచ్చుకోవాలని సూచించారు. బాధ్యతాయుతంగా, పారదర్శకతతో ఆరోగ్యకరమైన పని సంస్కృతిని నిర్మించాలని కోరారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డైరెక్టర్లు వి మోహన్ రావు, వి తిరుపతి రెడ్డి, టి మధుసూదన్, సి ప్రభాకర్, సీవీవో బోనాల కిషన్, సీఈలు టి సదర్ లాల్, కె తిరుమల్ రావు, కె రాజు చౌహాన్, బీబీ అశోక్, వెంకటరమణ, అన్నపూర్ణ, సురేందర్, కె మాధవరావు, ఎన్ శ్రవణ్ కుమార్, సీజీఎంలు చరణ్ దాస్, కిషన్, కంపెనీ సెక్రటరీ కె వెంకటేశం, జాయింట్ సెక్రటరీ కృష్ణ, రమేష్, జీఎంలు, ఎస్ఈలు, వివిధ ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గిర్నిబావి ప్లంబర్ అండ్ ఎలక్ట్రీషియన్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



దుగ్గొండి, అక్షర దర్బార్ : దుగ్గొండి మండలం గిర్నిబావి ప్లంబర్ అండ్ ఎలక్ట్రీషియన్ యూనియన్ నూతన కమిటీ గురువారం ఎన్నుకున్నారు.. గిర్నిబావి వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడిగా సార రాములు, యూనియన్ అధ్యక్షుడిగా అజారుద్దీన్, ఉపాధ్యక్షులుగా నూనవత్ శంకర్, కార్యదర్శిగా గంజి రాజేందర్, సహాయకార్యదర్శిగా సంగినేని గణేష్, కోశాధికారిగా ఊరుగొండ రమేష్ (రాజు), ఆర్గనైజర్ గా కోడూరి వేణు కమిటీ సభ్యులుగా దండు అనిల్, ఎల్లగొండ రాజేందర్., అంజద్ పాషా, కొలుగూరి ప్రవీణ్, బానోత్ పీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు సార రాములు తెలిపారు.



## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రానికి చెందిన ముడతల పెల్లి సదానందం తన అమ్మానాన్నల జ్ఞాపకార్థం ఎస్సీ హాస్టల్‌లోని విద్యార్థులకు భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన సదానందం, విద్యార్థులు భోజనం చేయడానికి అవసరమైన ప్లేట్లను అందజేశారని హాస్టల్ వార్డెన్ నేపాలి వేణు సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ, తన తల్లిదండ్రులు విద్యపై ఉన్న అపారమైన అభిమానం వల్లే తనకు చదువు పట్ల ఆసక్తి కలిగిందన్నారు. హాస్టల్‌లోని పరిస్థితులను తెలుసుకున్న తరువాత, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజన ప్లేట్లను సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని హాస్టల్ వార్డెన్ వేణు సింగ్ అభినందించారు.

## టీఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణ



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: టీఎన్జీవోస్ యూనియన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా 2026 క్యాలెండర్‌ను జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధి కోసం ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. TNGOs జిల్లా అధ్యక్షుడు బి. రవి కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో TNGOs సంఘం నాయకులు, వివిధ విభాగాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించిన సర్పంచ్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలో రోడ్డు మరమ్మతు పనులను గ్రామ సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి గురువారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పర్లపెల్లి వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించి, గుంతల్లో మొరం పోసి చదును చేశారు. రెండేళ్లుగా గ్రామంలో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నూతన సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గ్రామంలో పారిశుద్ధ్యంతో పాటు రోడ్ల విస్తరణ, మరమ్మతు పనులను పునఃప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్ రెడ్డితో పాటు గ్రామ కార్యదర్శి సుజాత, డీలర్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్, హరీశ్ రావుకు నాగూర్ల శుభాకాంక్షలు



అక్షర దర్బార్, పరకాల: ఆంగ్ల నూతన సంవత్సరం–2026 సందర్భంగా బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మాజీ మంత్రి హరీశ్‌రావులను తెలంగాణ భవన్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, బి.ఆర్.ఎస్ నాయకులు బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచులను సన్మానించిన బాల్యమిత్రులు

అక్షర దర్బార్, నల్లబెల్లి: ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్ దంపతులను బాల్యమిత్రులు గురువారం ఘనంగా సన్మానించారు. నల్లబెల్లి గ్రామ సర్పంచ్ నాగేల్లి జ్యోతి–ప్రకాశ్‌తో పాటు లెంకాలపల్లి గ్రామ సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి–రవీందర్‌లను వారి చిన్ననాటి మిత్రులు (1992–93 ఎస్ఎస్సీ బ్యాచ్) శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, రవీందర్ పాల్గొన్నారు.

## భీమా కోరేగావ్ అమరవీరులకు నివాళి



అక్షర దర్బార్, చిట్యాల : భీమా కోరేగావ్ యుద్ధంలో వీరమరణం పొందిన దళిత అమరవీరులకు చిట్యాల మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నే యుగేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య, ఇతర సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, 1818 జనవరి 1న భీమా కోరేగావ్ వద్ద 500 మంది మహార్ సైనికులు, 28 వేల మంది పేశ్వా సైన్యాన్ని ఓడించి చారిత్రక విజయం సాధించారని గుర్తు చేశారు. ఇది దళితుల ఆత్మగౌరవం, సమానత్వం కోసం సాగిన పోరాటానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆ యుద్ధంలో 28 మంది మహార్ సైనికులు అమరులయ్యారని, వారి త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్, మండల మాజీ అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్, ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు, ధర్మసమాజ్ పార్టీ మండల కార్యదర్శి మాట్టేవాడ కుమార్, ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్, నాయకులు గుర్రపు తిరుపతి, రాజమౌళి, గడ్డం సదానందం, ఏకు కిషన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి క్లాస్ మేట్స్ ఆర్థిక సహాయం

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలం లెంకాలపల్లి గ్రామానికి చెందిన యాదండ్ల చిన్న కొమురయ్య ఇటీవల పాముకాటుతో మృతి చెందడంతో, ఆయన చిన్ననాటి మిత్రులు (1992–93 పదో తరగతి క్లాస్‌మేట్స్) గురువారం రూ.26,011 ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి – రవీందర్‌తో పాటు బాల్యమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన సోదా

అక్షర దర్బార్, పరకాల: పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డికి పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండలోని ఆయన నివాసంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నల్లెల్ల అనిల్ కుమార్, పసుల రమేష్, బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, పంచగిరి జయమ్మ, దామ అనిల్, ఎండి ఆలీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో 14వ వార్షికోత్సవం..

### 18 కలశాలతో మహా పడిపూజ




అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో 14వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 18 కలశాలతో మహా పడిపూజ జరగనుంది.ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పరకాల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహా పడిపూజలో పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందాలని కమిటీ కోరింది. పడిపూజ అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రామతీర్థం సర్పంచ్, ఉప సర్పంచ్‌కు సన్మానం



అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలం రామతీర్థం గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పొదిలా వసంత శోభన్, ఉప సర్పంచ్ ఎం.డి. తహేర్ యాకూబ్‌లను జాతీయ మానవ హక్కుల కమిటీ (NHRC) ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ ఆవునూరు కిషోర్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా పనిచేసి ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌తో పాటు కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## 22 వార్డుల ముసాయిదా ఎన్నికల జాబితా సిద్ధం

అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పరకాల పట్టణంలోని 22 వార్డులకు సంబంధించి ముసాయిదా ఎన్నికల జాబితాను సిద్ధం చేసి మున్సిపల్ కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రచురించినట్లు పరకాల మున్సిపల్ కమిషనర్ సోమిరెడ్డి అంజయ్య తెలిపారు. జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా సమర్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టిపిఓ సుష్మతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



# కలల వేటలో.. తనే బలియై

- జర్మనీలో జనగామ యువకుడి దుర్మరణం
- భవనంలో అగ్ని ప్రమాదం.. కిందికి దూకిన యువకుడు



అక్షరదర్బార్, జనగామ: ఉన్నత చదువుల కోసం జర్మనీకి వెళ్లిన తెలంగాణకు చెందిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయాడు. జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన తోకల హృతిక్ రెడ్డి జర్మనీలో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లాడు. తాజా తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో ఊహించని విధంగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అపార్ట్‌మెంట్‌లో మంటలు వేగంగా వ్యాపించడంతో, ప్రాణాలు కాపాడుకోవాలనే ఆందోళనలో హృతిక్ రెడ్డి భవనం పైనుంచి కిందికి దూకేశాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో పరిస్థితి విషమించింది. వెంటనే అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినప్పటికీ, ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ హృతిక్ రెడ్డి మృతి చెందినట్లు సమాచారం అందింది. తమ కుమారుడు మరణించాడన్న వార్త వినగానే మల్కాపూర్‌లోని అతని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ప్రమాదానికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ప్రభుత్వం సాయం కోరుతున్నారు.




## కలెక్టర్ ను కలిసిన గ్రాండ్ మాస్టర్ అర్జున్

అక్షరదర్బార్, హనుమకొండ: అంతర్జాతీయ చెస్ వేదికపై భారతదేశానికి గర్వకారణంగా నిలుస్తున్న గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫిడే వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించి దేశానికి కీర్తి తీసుకువచ్చిన అర్జున్ ఇరిగేసిని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్జున్ ఇరిగేసి తల్లిదండ్రులు డా ఇరిగేసి శ్రీనివాస్ రావు జ్యోతి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కు విషెష్



అక్షర దర్బార్ సంగెం: నూతన సంవత్సరం సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని అనుమకొండలోని తన నివాసంలో సంగెం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులుకందగట్ల నరహరి, గుమ్మడి హరిబాబు, వీరమ్మ గోపి సింగ్ మునుగుంట్ల కోటేశ్వర్, దండ నరేష్, ఉప సర్పంచ్ గుంటూరుపల్లి వెంకటయ్య మాజీ సర్పంచ్ కుంటపల్లి నల్లబెల్లి మాజీ సర్పంచ్ కొట్టం సంపత్,పాశం రాజ్ కుమార్, మీట్టుపల్లి ప్రవీణ్,రాంబాబు పాల్గొన్నారు.

### నడికూడ నేతలు



అక్షరదర్బార్, పరకాల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నేతలు పలువురు గురువారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నడికూడ మండలంలోని రాయపర్తి గ్రామ మాజీ సర్పంచ్ పర్నెం తిరుపతిరెడ్డి ఎమ్మెల్యే రేవూరికి పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.

## 'భగీరథ' పైప్ లైన్ కు మరమ్మతులు చేయాలి



అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలంలోని ఐదవ వార్డులో మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి భారీగా నీటి వృధా జరుగుతున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ నాగేల్లి జ్యోతి–ప్రకాశ్ స్పందించారు. వార్డు సభ్యుడు ముస్కే చైతన్య భరత్‌తో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రజలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



## మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ..

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని ఎంపీడీఓ క్వార్టర్స్ కాలనీకి చెందిన కొంగ లచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా చిట్యాల మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ–నరేందర్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్–రవీందర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లకొండ కుమార్, 7వ వార్డు సభ్యులు అల్లం అనూష–రాజు మృతదేహానికి నివాళులు అర్పించారు. లచ్చమ్మ మృతి బాధాకరమని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.

# 2028లో కేసీఆరే మళ్లీ సీఎం

- లక్ష్యం దిశగా కదంతొక్కండి
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి
- గులాబీ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు



అక్షరదర్బార్, హైదరాబాద్: 2028లో కేసీఆరే మళ్లీ సీఎం అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ నూతన సంవత్సర వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. కేటీఆర్ పార్టీ 2026 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. 2026వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో గడిచిన రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ఆయన ఎండగట్టారు. క్యాలెండర్లు మారుతున్నాయే తప్ప, మార్పు వస్తుందని నమ్మి ఓటేసిన తెలంగాణ ప్రజల బతుకుల్లో ఎలాంటి వెలుగులు నిండలేదని, పైగా రాష్ట్రం అభివృద్ధిలో వెనక్కి వెళ్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న దుర్భర పరిస్థితులు మళ్లీ రాష్ట్రానికి దాపురిస్తున్నాయని కేటీఆర్ హెచ్చరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో అన్నదాతలకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూశామని, కానీ నేడు పండుగ పూట కూడా రైతులు యూరియా కోసం రోడ్ల మీద పడాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. కటిక చలిలో గంటల తరబడి, కొన్నిసార్లు రోజుల తరబడి ఎరువుల బస్తాల కోసం లైన్లలో నిలబడటం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ కాలం నాటి పోరాట స్ఫూర్తిని గుర్తు చేస్తూ, 14 ఏళ్ల పాటు కేసీఆర్ సాగించిన పోరాటం వల్ల వచ్చిన ప్రగతిని ఏ శక్తీ తుడిచిపెట్టలేదని స్పష్టం చేశారు.పార్టీ కార్యకర్తలే బీఆర్ఎస్‌కు అసలైన వెన్నెముక అని కేటీఆర్ కొనియాడారు. పదవుల్లో ఉన్న నాయకుల కంటే, జెండాను భూమిలో నిటారుగా పాతి "ఇది నా జెండా" అని గర్వంగా చెప్పే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ సాగిస్తున్న దుష్పరిపాలనపై క్షేత్రస్థాయిలో పోరాడుతున్న ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. లగచర్లలో అమాయక గిరిజనులపై జరిగిన దాడులు, రుణమాఫీ పేరిట రైతులకు జరిగిన అన్యాయం, రైతుబంధును రెండుసార్లు ఎగ్గొట్టిన వంచనపై బీఆర్ఎస్ శ్రేణులు చేస్తున్న పోరాటం అమోఘమని అన్నారు. 'ఆరు గ్యారంటీలు – 420 హామీలు' అంటూ కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు సఫలమయ్యారని తెలిపారు. నగర అభివృద్ధి పేరుతో మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. బాధితుల పక్షాన నిలబడి గళమెత్తిన సోదరులకు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల ఆక్రమణకు వ్యతిరేకంగా నిలిచిన విద్యార్థులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అన్యాయానికి వ్యతిరేకంగా ఎదురు నిలుస్తున్న తెలంగాణ ఆడబిడ్డలు, తమ్ముళ్లే పార్టీ భవిష్యత్తు అని అన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా గులాబీ జెండాను అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. వచ్చే రెండేళ్ల కాలం పార్టీకి అత్యంత కీలకమని, ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తూనే, మరోవైపు పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 2028 ఎన్నికలే లక్ష్యంగా, కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త నడుం బిగించాలని కోరారు. ధర్మం, న్యాయం తమ వైపే ఉన్నాయని, అందుకే అంతిమ విజయం తమదేనని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎదురుదెబ్బలను పాఠాలుగా మార్చుకుని, రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## కొత్తగూడలో మళ్లీ పులి కేక

- అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తం
- సరిగ్గా గతేడాది ఈ రోజునే పులి అలికిడి
- మళ్లీ అదే రోజు ఇదే ప్రాంతంలో సంచారం



అక్షరదర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని అటవీ ప్రాంతంలో గత రెండు రోజులుగా పులి కదలికలు కనిపిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం ఓటాయి, రాంపూర్, కర్ణగండి అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్తగూడ మండలం రెన్యాతండా సమీపంలోని కాలిబాటలో పులి అడుగులను అధికారులు గుర్తించారు. పులి సంచారం స్థిరపడటంతో జిల్లా అటవీ శాఖ అధికారి విశాల్ ఆదేశాల మేరకు అన్ని బీట్ల సిబ్బంది అప్రమత్తమయ్యారు. అడవిలో పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. విశేషం ఏమిటంటే, సరిగ్గా ఏడాది క్రితం జనవరి 1వ తేదీనే పూనుగొండ్ల అటవీ ప్రాంతంలో పులి సంచరించిన దృశ్యాలు ట్రాప్ కెమెరాలకు చిక్కాయి. మళ్లీ సరిగ్గా ఏడాది తర్వాత అదే సమయంలో కొత్తగూడ అడవుల్లో పులి అడుగులు కనిపించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.




## మరింత మెరుగైన సేవలు

- సీపీ సన్ ప్రీత్ సింగ్
- పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు




అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ క్యాంప్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని అధికారులతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు ప్రభుత్వ అధికారులు, పాఠశాల విద్యార్థులు, మీడియా ప్రతినిధులు పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పాగుచ్చలు, మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, లక్ష్యాలను పూర్తి చేయాలని, అలాగే పోలీస్ అధికారులు, సిబ్బంది సుఖసంతోషాలతో ఉండాలని, ముఖ్యంగా తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రాజమహేంద్ర నాయక్, దార కవిత, ఏఎస్పీ శుభం, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్, బాలస్వామి, సురేష్ కుమార్, శ్రీనివాస్ తో పాటు ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబరన్నంటిన న్యూ ఇయర్ సంబురాలు

- కిటకిటలాడిన ఆలయాలు
- ఇష్టదైవానికి మొక్కులు తీర్చుకున్న భక్తులు



అక్షరదర్బార్, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2026 నూతన సంవత్సర వేడుకలు అంబరన్నంటాయి. గురువారం వేకువజాము నుంచే భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాల గుడి, రామప్ప ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాదిలో తమకు, తమ కుటుంబాలకు అంతా మంచి జరగాలని కోరుకుంటూ వేలాది మంది భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రధాన ఆలయాలన్నీ విద్యుత్ దీపాలు, పుష్ప అలంకరణలతో శోభాయమానంగా దర్శనమివ్వగా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

## స్టేషనరీతో కలెక్టర్ కు శుభాకాంక్షలు



అక్షరదర్బార్, ములుగు: హాస్టల్ పిల్లలకు ఉపయోగపడే దుప్పట్లు, స్టేషనరీతో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా శాఖ శుభాకాంక్షలు తెలియజేసింది. గురువారం కలెక్టరేట్ లో కలెక్టర్ దివాకర టిఎస్ కు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసారం హాస్టల్ విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు దుప్పట్లు మొదలగునవి మాత్రమే తీసుకురావాలని సూచించడంతో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నుంచి హాస్టల్ పిల్లలకు దుప్పట్లు, వాటర్ బాటిల్స్, స్టేషనరీ పెద్ద ఎత్తున కలెక్టర్ కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం సంపత్ రావు మాట్లాడుతూ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పక్షాన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, మహేందర్ జి అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జి, రెవెన్యూ ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కందుల జీవన్ కుమార్, సంఘ నాయకులు ప్రకాశ్ రెడ్డి, కే కొమురయ్య, బి శ్రీనివాస్, కె శిరీష, ఎం రాజు, రాజ్ కుమార్, విజయభాస్కర్, యశ్వంత్, రఫీక్, దుర్గారావు, సారంగపాణి రాజేశ్వరరావు, రహీం, రాజు పాల్గొన్నారు.